# పత్రికా ప్రకటన

**తేది: 06.10.2021**

ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు అనువాద అధ్యయన శాఖ ఆధ్వర్యంలో **"ఆధునిక తెలుగు కథా సాహిత్యం – సామాజిక చిత్రణ"** అనే అంశంపై సదస్సును నిర్వహించారు. బుధవారం వర్శిటీ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వర్శిటీ వైస్–ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ, గౌరవ అతిథిగా వర్శిటీ రెక్టార్ ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్, ఆత్మీయ అతిథిగా తులనాత్మక ద్రావిడ భాషల అధ్యయన పీఠం డీన్ ఆచార్య ఎన్.సుశీల, సభాధ్యక్షులుగా తెలుగు శాఖాధ్యక్షులు, రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డిలు పాల్గొనగా.. ప్రత్యేక ఉపన్యాసకులుగా సుప్రసిద్ధ కథా రచయిత, పత్రికా రచయిత, కాలమిస్టు మహమ్మద్ ఖదీర్ బాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా **వర్శిటీ వైస్–ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ** గారు మాట్లాడుతూ... మహా కావ్యాలు, ఇతిహాసాలు, పురాణాలు, ప్రబంధాలు వచ్చాయని కానీ ఆధునిక జీవితం ఒక రచనగా మలచడం వెనుక ఉన్నటువంటి సాధకబాధకాలు ఒక నిష్టతో, నిబద్ధతతో రాసే వారికే తెలుస్తుందని అన్నారు. పారిశ్రామిక యుగం వచ్చిన తరువాత అభద్రతా భావం గురించి కతానిక గుర్తుకు వచ్చిందని కొంత మంది చెప్తారని, అలాగే ఒక ప్రియుడు తన ప్రేయసికి ఉత్తరం రాస్తే ఆ ఉత్తరం మొదటి కథకు సమానంగా మారడం గమనించాలని అన్నారు. పెట్టుబడి సమాజం ఎన్నో కానుకలు ఇచ్చిందని, మరెన్నో కష్టాలు ఇచ్చిందని.. కానీ అపురూపమైనటువంటి కానుకల్లో కథానిక ఒకటని అన్నారు. అట్లాగే మనకు కథానిక అన్నప్పుడు చాలా మందికి చాలా సమస్యలు ఉంటాయని, కథను నిర్వచించడం ఎవరికీ సాధ్యం కాదని, ఏ ఒక్కరూ ఒక నిర్వచనం చెప్పినా అది అర్థం చేసుకునేందుకు ఉపయోగపడటంలో ఒక చిన్న సూత్రిక మాత్రమే అన్నారు. జీవితం ఎలా నిర్వచనాలకు లొంగదో కథానిక కూడా నిర్వచనాలకు లొంగదన్నారు. చెప్పుకోవడానికి చాలా సుప్రసిద్ధమైనటువంటి కథలు ఉన్నా కథకి ఆది, అంతం ఉండదని, కథ ఎక్కడ వదిలిపెడితే అక్కడ నుండి ఇంకో కథ మొదలవుతుందని అన్నారు. అందుకని నా మాటలో కథానిక అంటే ఒక దోసిటి నీళ్ళలో ఒక సముద్రాన్ని మనం చూపించవచ్చని అన్నారు. మనం ఎత్తుకునేది దోసిటి నీళ్ళే అయినా కానీ ఆ దోసిటి నీళ్లలో ఒక సముద్రం ఎంత పెద్దది అంత పెద్ద జీవితాన్ని ఒక చిన్న కథానికలో ఎందరో మహానుభావులు చూపించారని గుర్తు చేశారు. విశ్వనాథ అద్భుతమైన కథలు రాశారని, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి, కుటుంబరావు లాంటి వారు కథానికకు చేసిన సేవలను ఆయన కొనియాడారు.

ప్రత్యేక ఉపన్యాసకులుగా విచ్చేసిన **మహమ్మద్ ఖదీర్ బాబు** గారు మాట్లాడుతూ... ఆంజనేయుడి ముందు కుప్పిగంతులు వేయకూడదని.. మా గురువు గారు ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి ముందు కథ గురించి నేను మాట్లాడకూడదని.. కానీ శిష్యుడు కూడా అప్పుడప్పుడు గురువు ముందు మాట్లాడవచ్చని అన్నారు. ఈ చిత్తూరు నేల నుండి వందలాది కథలు రాసి తెలుగు కథకు చక్రవర్తిగా, మాస్టారుగా, తెలుగు కథా వికాసానికి ఒక ధివిటిగా ఉన్న ఈ నేల కథా రచయిత మధురాంతరం రాజారాం గారి 91 జయంతిని గుర్తు చేసుకుంటూ ఒక్క సారి అందరూ చప్పట్లు కొట్టాలని కోరారు. ఈ చిత్తూరు నేల తెలుగు కథకు చేసిన సేవ అసామాన్యమైనదని అన్నారు. మధురాంతకం రాజారాం గారి వద్ద నుండి కె.సభా గారు, పులికంటి కృష్ణారెడ్డి గారు, మధురాంతకం మహేంద్ర గారు, తుమ్మల రామకృష్ణ లాంటి వారు చేసిన సేవ సామాన్యమైనది కాదన్నారు. నాకు ఈ ప్రాంతంతో నాకు ఆత్మీయ అనుబంధం ఉందని.. ఈ గడ్డ నుండి పుట్టిన ఒక అద్భుత రచయిత సుబ్రమణ్యం నాయుడు నాకు మరొక గురువని

అన్నారు. ఆయన నా చేత దర్గామిట్ట కథలు అని రాయించారని, ఆ కథలు పత్రికల్లో ప్రచురితమైనప్పుడు అవి తెలుగు సాహిత్యం ఒక పార్శ్యాన్ని అతి గొప్పగా, ముస్లిం జీవితాన్ని అతి గొప్పగా ఇచ్చాయని అందరూ ప్రశంసించారని అన్నారు. సుంకోజి దేవేంద్రచారి, ఎండవల్లి భారతిని, సామాన్య, ఝాన్సీ లాంటి వారు ఈ ప్రాంతం నుండి రచయితలుగా ఉన్నారని, వీరి గురించి విద్యార్థులు తప్పక తెలుసుకోవాలని అన్నారు. వీరందరూ అద్భుతమైన గ్రామీణ జీవితాన్ని చూస్తూ పెరిగివుంటారని, మీకు మట్టి విలువ, మనిషి విలువ తెలుసుంటుందని ఆశిస్తూ అలాంటి జీవితం ఉన్నవాళ్ళు రచయిత అవటం చాలా సులభం అన్నారు. నేను ఇక్కడికి వచ్చి ప్రసంగిస్తున్నానంటే ముమ్ముందు మీలో ఒకరిద్దరైనా నా ముందుకు వచ్చి మీ వలన ప్రేరణ పొంది కథలు రాస్తున్నానని చెప్తే చాలా సంతోషంగా వుంటుందని విద్యార్థులతో అన్నారు.

అనంతరం ప్రత్యేక ఉపన్యాసకులుగా విచ్చేసిన మహ్మమద్ ఖదీర్ బాబును వర్శిటీ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సదస్సులో వర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**– డా.పి.మురళీకృష్ణారెడ్డి, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**




DRAVIDIAN UNIVERSITY


DRAVIDIAN UNIVERSITY

